# ప్రజాపక్షం

PRAJAPAKSHAM

స్తంభాద్రి భద్రాద్రి

బుధవారం | 17 | ఏప్రిల్ | 2024


పేజీలు 8


## ఐపిఎస్‌గా సెలెక్ట్ అయిన రావూరి సాయి అలేఖ్య



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ రావూరి ప్రకాశరావు కుమార్తె రావూరి సాయి అలేఖ్య యూపిఎస్సీ సివిల్ సర్వీస్ 2023 ఆల్ ఇండియా లెవెల్‌లో 938వ ర్యాంకు సాధించి ఐపిఎస్‌గా సెలెక్ట్ అయ్యారు. సాయి అలేఖ్య చిన్నతనం నుండే ఐపిఎస్ కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివింది. తల్లి దండ్రులు తన లక్ష్యాన్ని గౌరవించి చదువులో ప్రోత్సహించారు. అలేఖ్య తండ్రి రావూరి ప్రకాశరావు మధిర పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. గత ఏడాది మే 28 ప్రిలిమ్స్ నిర్వహించారు. ప్రిలిమ్స్ పరీక్షలు క్లియర్ చేసిన వారికి సెప్టెంబర్ 15,16,17,23,24 తేదిలో దశల వారిగా మెయిన్స్ పరీక్ష నిర్వహించి డిసెంబర్ 8న మెయిన్స్ ఫలితాలు విడుదల చేశారు. మెయిన్స్ సత్తా చాటిన వారికి జనవరి 2, ఏప్రియల్ 9 మధ్య వివిధ దశల్లో పర్సనల్ ఇంటర్వ్యూల్ నిర్వహించి తాజాగా తుది ఫలితాలు ప్రకటించారు. సెలెక్ట్ అయినా రావూరి సాయి అలేఖ్యను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రముఖ న్యాయవాది తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, ఏనుగు గాంధీ, జక్కుల రామారావు తదితరులు అభినందలు తెలిపారు.

# నేడే సీతారాముల కళ్యాణం



- రేపు పట్టాభిషేకం
- శోభాయమానంగా భద్రగిరి
- ఎన్నికల కోడ్‌తో అతిరథ మాహారదుల రాక రద్దు
- ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించనున్న సిఎస్

**ప్రజాపక్షం/భద్రాచలం :** దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న పుణ్యభద్రాద్రి శ్రీ సీతారాముల పెళ్లికి ముస్తాబైంది. లోక కళ్యాణార్ధం మిథిలా స్టేడియంలో నవమి నాడు రామచంద్ర స్వామికి, సీతమ్మ తల్లి కళ్యాణ వేడుక అంగరంగ వైభవంగా జరగనుంది. మరుసటి రోజు నాడు రాజాధిరాజు రామయ్యకు మహాపట్టాభిషేకాన్ని నిర్వహిస్తారు. ఇందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భద్రాద్రి వీధులన్నీ పండుగ కళతో శోభాయమానంగా మారిపోయాయి. భక్తరామదాసు కాలం నుండి నేటి వరకు ఈ దివ్య క్షేత్రంలో సీతారాములు పెళ్లి వేడుక అభిజిత్ లగ్నంలో ఆరుబయట నిర్వహిస్తారు. అలనాటి గోల్కొండ నవాబు తానీషా ప్రభువు కళ్యాణం సందర్భంగా సీతారాములకు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆ నాటి నుండి నేటికీ ఆనవాయితీ ప్రకారం పాలక ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఇక్కడ సీతారాముల కళ్యాణానికి వినియోగించే తలంబ్రాలకు ఓ ప్రత్యేకత ఉంది. ముస్లీం సాంప్రదాయ పద్దతిలో పన్నీరు, అత్తరుతో పాటు ఇతర సుగంధ ద్రవ్యాలలో పసుపు,కుంకుమలు కలిపి తయారు చేస్తారు. వీటిని నవమి నాడు శీతారాముల శిరస్సులపై అత్యంత భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా రుత్వికులు పోస్తారు. అలనాడు రాముదాసు చేయించిన బంగారు ఆభరణాలే నేటికీ సీతారాములతో పాటు లక్ష్మణ స్వామికి ధరింపజేసి వేడుకను నిర్వహిస్తారు. ఇక్కడ విశేషం ఏమిటంటే సీతమ్మవారు ధరించే మంగళసూత్రంలో మూడు సూత్రాలు ఉంటాయి. ఒకటి రాముని వంశానికి చెందినది కాగా, రెండోది సీతమ్మ పుట్టింటిది, మూడోది

మిగతా 2లో..

## కాంగ్రెస్ అసమర్ధత వల్లే

# బలపడుతున్న బిజెపి



- -బిఆర్ఎస్ గళమే ప్రజలకు బలం
- -మెడికల్ కళాశాల తరలింపు అనాలోచిత చర్య
- -బిఆర్ఎస్ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్
- -హాజరైన ఎంపిలు వద్దిరాజు, నామ, మేయర్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ అసమర్ధత వలనే దేశంలో బిజెపి బలపడిందని ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి బిజెపికి అవకాశంగా మారుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్షంగా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ విఫలమైందని ఇండియా కూటమిని ఏర్పాటు చేసిన ఎక్కడ సరైన రీతిలో మిత్ర పక్షాల మధ్య ఒడంబడిక కూదుర్చుకోలేకపోయిందని ఇది బిజెపికి సానుకూల అంశంగా మారిందన్నారు. బెంగాల్, కేరళ, పంజాబ్‌ల్లో కాంగ్రెస్ బలహీనత మరోసారి బయటపడిందన్నారు. బిఆర్ఎస్ ఖమ్మం నియోజక వర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం పువ్వాడ అజయ్‌కుమార్ స్వగృహంలో మంగళవారం నగర బిఆర్ఎస్ అధ్యక్షులు పగడాల నాగరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ చెప్పే దానికి, చేసే దానికి పొంతన ఉండదని పార్టీ ఫిరాయింపులపై ప్రజల ముందు మేనిఫెస్టోలో

మిగతా 2లో..




# నేడే సీతారాముల కళ్యాణం



(మొదటిపేజీ తరువాయి)

భక్తరామదాసుది.

**ప్రత్యేక పల్లకీలో మిథిలాకి....**

సీతారాముల కళ్యాణం సందర్భంగా ప్రత్యేక పల్లకీలో సీతారామ, లక్ష్మ ణులను మిథిలా స్టేడియానికి తీసుకొత్తి సిద్ధం చేసిన పెళ్ళి పీటలపై ఆశీలను చేస్తారు. ముందుగా అంతరాలయంలో ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలు ధరింపజేసి అందంగా అలంకరిస్తారు. దారి పొడవునా రామనామ సంకీర్తలను ఆలపిస్తుండగా, భక్తకోటి జనం జై శ్రీరాం అంటూ నినాదాలతో కోలాట, భజన బృంధాల నృత్యాల నడుమ కళ్యాణ మండపానికి తోడుకొస్తారు.ఈ సన్నివేశం జరుగుతుండగా భద్రగిరి ఒక్క సారిగా భక్తిభావంతో మురిసిముద్దవుతోంది. పెళ్లిపీటలపై ఆశీలలైన దేవతామూర్తులకు సంప్రోక్షణ చేసి కళ్యాణ తంతు ప్రారంభిస్తారు. జీలకర్రబెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సులపై ఉంచి కళ్యాణ ఘట్టాన్ని కొనసాగిస్తారు. ఈ సందర్భంగా ముస్లీం సాంప్రదాయ పద్దతుల్లో తయారు చేసిన తలంబ్రాలలో ముత్యాలను కలిపి దేవతామూర్తుల శిరస్సులపై పోసే తీరు నేత్రవర్వంగా మారుతాయి. దీంతో ఒక్క సారిగా మిథిలా ప్రాంగణం జై శ్రీ రామ్ అనే నినాదంతో మార్మోగిపోతుంది.

**రేపు పట్టాభిషేకం ...**

రామనవమి ముగిసిన మరుసటి రోజు రాజాధిరాజు రామచంద్ర ప్రభువుకి పట్టాభిషేకం నిర్వహిస్తారు. రాజఠీవితో స్వామివారు సింహాసనంపై ఆశీనులు కాగా వేదమంత్రాలతో స్వామికి పూజలు చేసి పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపిస్తారు. ఈ సందర్భంగా రాములు వారు రాజైన భవాంతో ఏలుకో రా రామా... మమ్మేలుకో వయ్యా... అంటూ భక్తి పారవశ్యానికి భక్తులు లోనవుతుంటారు.

**శోభాయమానం ...**

శ్రీసీతారాముల కళ్యాణ సందర్భంగా భద్రగిరి శోభాయమానంగా మారింది. ఎటు చూసినా యాత్రికులతో కళకళ్లాడుతోంది. వీధులన్నీ భక్తుల రామనామ స్మరణ నడుమ పవిత్రంగా మారిపోతున్నాయి. గోదావరి స్నానఘట్టాల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తూ భక్తిభావంతో నిండుకుంటున్నారు. స్నానాలు పూర్తికాగానే నేరుగా ఆలయానికి చేరుకుని ఇష్టదైవాన్ని మొక్కుకుంటున్నారు. ఆలయ పరిసరాలు పెళ్లి తోరణాలతో నిండిపోయాయి. సుగంధ ద్రవ్యాల సువాసనాలు, పద్మాల పరిమళాలతో పరిసరాలు పండుగ వాతావారణంతో నిండిపోయాయి. ఆలయ పరిసరాలు విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. శోభాయమానంగా మారిన పరిసరాలతో పెళ్లి కళ ఉట్టిపడుతోంది.

**ప్రభుత్వం తరుపున సిఎస్ ...**

ఎన్నికల కోడ్ కారణంగా రాష్ట్రప్రభుత్వం నుండి ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ తదితరులు హాజరుకావడం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ శాంతకుమారి ప్రభుత్వం తరుపున సీతారాములకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. ఆమె మంగళవారం సాయంత్రానికే భద్రాచలం చేరుకోగా, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, ప్రత్యేకాధికారి నరేంద్ర నింజే, దేవదాయ, సమాచార శాఖ కమీషనర్ హనుంతరావు, ఎస్పి రోహిత్ రాజులు పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికాలు. పోలీస్ శాఖ తరుపున గౌరవ వందనం సమర్పించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

**-29 మంది మృతి -ధ్రువీకరించని అధికారులు**

**-కొనసాగుతున్న ఆపరేషన్**



**ప్రజాపక్షం/ ఖమ్మం / భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ ప్రాణ నష్టం జరిగిందని కడపటి సమాచారం మేరకు 29 మంది మావోయిస్టు మృతదేహాలను కనుగొన్నట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌లోని కాంఖేర్ జిల్లా చోటాబెటియా పోలీస్ స్టేషన్ పరిధిలో బీనాగుండా మరియు కరోనార్ మధ్య అటవీ ప్రాంతంలో పోలీస్ స్టేషన్‌కు సుమారు 15 కిలో మీటర్ల దూరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మావోయిస్టులు సోమవారం బంద్‌కు పిలుపునివ్వడం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో బంద్ విజయవంతం కావడంతో సాయుధులైన మావోయిస్టులు ఈ ప్రాంతంలో ఓ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశ సమాచారం తెలుసుకున్న డిఆర్‌జి మరియు బిఎస్‌ఎఫ్ సాయుధ దళాలు ఉమ్మడిగా మావోయిస్టు లను ముట్టడించాయి. ఇరు వర్గాల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. గంట పాటు ఎదురు కాల్పులు జరిగాయి. తర్వాత సాయుధ పోలీస్ దళాలు ఈ ప్రాంతంలో సోదాలు నిర్వహించగా ఇప్పటి వరకు 29 మంది సాయుధ మావోయిస్టు మృతదేహాలు లభ్యమయ్యాయని తెలుస్తుంది. ఇంకా ఆపరేషన్ కొనసాగుతుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు సైనికులు కూడా గాయపడ్డారు. గాయపడిన సైనికులకు ఎటువంటి ప్రాణాపాయం లేదని మెరుగైన చికిత్స కోసం హెలికాప్టర్ ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించారు.

# న్యాయవాద సొసైటీ ఛైర్మన్ కాసర్ల



**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** న్యాయవాదుల సహకార సంఘం అధ్యక్షునిగా కాసర్ల రాజశేఖర్ రెడ్డి ఎన్నికయ్యారు. సహకార సంఘ డైరెక్టర్ల ఎన్నిక పూర్తి కావడంతో కొత్త కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 472 ఓట్లకు గాను 380 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో పలివెల శ్రీలక్ష్మి , అనుముల నర్సింహారావు, భూక్యా రమేష్, దేవకి శ్రీనివాసరావు లు ఎన్నికయ్యారు. డైరెక్టర్ల ఎన్నిక పూర్తయిన తర్వాత నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా అధ్యక్షులుగా రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మహ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శిగా నోముల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా రామ్మూర్తి, కోశాధికారిగా యాసా కాంతికుమారి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జి. రమేష్, సహాయ అధికారి రవికుమార్ ప్రకటించారు.

# కాంగ్రెస్ అసమర్థత వల్లే బలపడుతున్న బిజెపి

(మొదటిపేజీ తరువాయి)

అనర్హత వేటు వేస్తామని గొప్ప గొప్ప మాటలు చెప్పి కొద్ది గంటల్లోనే ఇతర పార్టీలకు చెందిన ఎంఎల్ఎలను చేర్చుకున్నారని ఇది కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. అలవి కాని హామీలను గుప్పించి గత ఎన్నికల్లో ప్రజలను వంచించిందని మోసపూరిత వాగ్దానాలను నమ్మి తెలంగాణ ప్రజలు మోసపోయారని అజయ్ కుమార్ తెలిపారు. బంగారం లాంటి కేసిఆర్ పాలనను వదులుకున్నారని ఇప్పుడు ఎంపి ఎన్నికల రూపంలో మరో అవకాశం వచ్చిందని ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామ నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పదవులు వస్తుంటాయి పోతుంటాయి కానీ చేపట్టిన పథకాలు, చేసిన అభివృద్ధి జనంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అజయ్‌కుమార్ తెలిపారు. కానీ ఆ గుర్తులను చేరిపేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని భౌతికంగా చేరిపేసిన ప్రజల హృదిలో నుంచి అభిమానాన్ని తొలగించలేరని అజయ్‌కుమార్ తెలిపారు. బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే బిఆర్ఎస్ గళం తెలంగాణ ప్రజలకు బలమవుతుందని ఆ బలం కావాలంటే నామ నాగేశ్వరరావును గెలిపించాలన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలని అజయ్‌కుమార్ కోరారు.

**మెడికల్ కళాశాల తరలింపు అనాలోచిత చర్య : అజయ్‌కుమార్**

ఖమ్మం పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలను తరలించడం అనాలోచిత చర్య అని అజయ్‌కుమార్ తెలిపారు. కేసిఆర్ ముందు చూపుతో 500 పడకల ఆసుపత్రికి అతి సమీపంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారని ఈ జిల్లాలో వేరే చోట ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చినప్పుడు కళాశాలకు అనుబంధంగా ఆసుపత్రి ఉండాలన్న లక్ష్యంతో తాను మంత్రిగా అక్కడ ఏర్పాటు చేశానని ఆసుపత్రికి, కళాశాలకు మధ్య ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే సరిపోతుందన్నారు. కానీ కొందరు కళాశాలను మార్చాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం ఉందని అది అనాలోచితమైందని వైద్య విద్యార్థులకు, అధ్యాపక



సిబ్బందికి నిరంతరం ఆసుపత్రితో సంబంధాలు ఉండాలని ఆయన తెలిపారు. ఇప్పటికే బిఆర్ఎస్ ఓటమి ప్రజల్లో ఆవేదనను కలిగించిందని ముమ్ముందు బిజెపి మరింత బలపడుతుందన్నారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఐదేండ్లలో ఖమ్మంను అజయ్‌కుమార్ హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి చేశారని ఈ జిల్లాకు చెందిన బిఆర్ఎస్ నాయకుల పట్ల కేసిఆర్‌కు ప్రత్యేకమైన అభిమానం ఉందన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చిన 100 రోజుల్లోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ ఇబ్బందులు పోవాలంటే ఎంపిగా బిఆర్ఎస్ అభ్యర్థి గెలవాలన్నారు. ఎంపి అభ్యర్థి, ప్రస్తుత సిట్టింగ్ ఎంపి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినిపించాలంటే బిఆర్ఎస్ ను గెలిపించాలన్నారు. కాంగ్రెస్, బిజెపి ఎంపిలు ఏనాడు తెలంగాణ నిధులు, సమస్యలు, ప్రాజెక్టుల గురించి మాట్లాడలేదన్నారు. తనకు ఓటేసి గెలిపిస్తే అండగా ఉంటానన్నారు. సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి మాజీ అధ్యక్షులు కూరాకుల నాగభూషణం, ఆర్‌జెసి కృష్ణ, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, రఘునాథపాలెం మండల బిఆర్ఎస్ అధ్యక్షులు వీరునాయక్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు టీషర్ట్స్ అందజేత



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి నివాసం బానోతు చిన్న కోటి, మంగమ్మల కొడుకు బానోతు వంశీకృష్ణ, దివ్యశ్రీ (యుఎస్ఏ) దంపతుల కుమార్తె మౌక్తిక నైరా మొదటి పుట్టినరోజు సందర్భంగా సింగరేణి మండలం ఎంపిపిఎస్ పోలంపల్లి పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు స్పోర్ట్స్ టీషర్ట్స్‌లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజ్మీరా వీరునాయక్, సహా ఉపాధ్యాయులు సుందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఆదిలక్ష్మి , అంగన్‌వాడీ టీచర్ జబ్బా వెంకటలక్ష్మి , పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ మారుమూల పాతం పోలంపల్లి విద్యార్థులు ప్రతిభను గుర్తించి ఇక్కడి విద్యార్థులకు స్పోర్ట్స్ టీషర్ట్స్ పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని, అమెరికాలో పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న చిన్నారి మౌక్తిక నైరాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# వీరభద్ర స్వామికి తుమ్మల పూజలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కురవిలోని శ్రీశ్రీశ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీరభద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు, అర్చకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ ఎంఎల్ఎ రాంచంద్రనాయక్, సాధు రమేష్‌రెడ్డి, తుపాకుల యలగొండ స్వామి, విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ విపి గౌతమ్





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నామినేషన్ల ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు పకడ్బందీగా చేపట్టాలని ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో కలిసి నూతన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి 25 వరకు జరుగుతుందని నూతన కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో పరిశీలించాల్సిన పత్రాలు, అభ్యర్థులకు అందించాల్సిన సూచనలు, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు తదితర అంశాలను ఆయన అధికారులకు వివరించారు. లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేయబోయే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి ఒక రోజు ముందు ప్రత్యేకమైన బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని, స్క్రూటీ ప్రారంభం కంటే ముందే అఫిడవిట్ కరెక్షన్స్, డిపాజిట్ సొమ్ము, కుల ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ ఫారం 2ఎ, అఫిడవిట్ ఫారం 26 ద్వారా సమర్పించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల ప్రతిపాదికులు తప్పనిసరిగా ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ పరిధిలో ఓటర్లుగా ఉండాలని, అభ్యర్థి వయస్సు, కులం వివరాలు నామినేషన్ పేపర్ పై నమోదు చేయాలని, రాజకీయ పార్టీల తరుపున నమోదు చేసే అభ్యర్థులు వారి డిక్లరేషన్ ఫారం సమర్పించాలన్నారు. అభ్యర్థి అఫిడవిట్ ఫారం 26లో పార్టీ పేరు, పార్లమెంటరీ నియోజక వర్గం పేరు, రాష్ట్రం పేరు, ఓటరు జాబితాలో పార్ట్, క్రమ సంఖ్య వివరాలు, పెండింగ్ క్రిమినల్ కేసుల వివరాలు, ఆస్తుల వివరాలు, అప్పుల వివరాలు, వృత్తి, విద్యార్హతలు మొదలగు అన్ని వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. అభ్యర్థి దాఖాలు చేసిన అఫిడవిట్ లో ప్రతి పేజీ పై అభ్యర్థి సంతకం చేసి ఉండాలని అఫిడవిట్ నోటరీ చేయాలని లేదా కమిషనర్, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాలని, అభ్యర్థి ఫోటో, సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీ తీసుకోవాలని తెలిపారు. నామినేషన్ తీసుకున్న తర్వాత రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి అఫిడవిట్‌లో అన్ని కాలములు నింపి ఉన్నాయా, ధృవీకరించిన ఓటరు జాబితా కాపీ (అభ్యర్థి ఇతర నియోజక వర్గ ఓటరైతే) , ఫారం ఎ, ఫారం బి, కుల ధృవీకరణ పత్రం, డిపాజిట్, ప్రతిజ్ఞ అంశాలను పరిశీలించి చెక్ లిస్టు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు వీలుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా కట్టుదిట్టంగా నామినేషన్ ప్రక్రియ సక్రమంగా జరగాలన్నారు. నామినేషన్ ప్రక్రియలో పనిచేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ప్రతి అంశాన్ని శ్రద్దతో పరిశీలించాలని నిర్లక్ష్యం వహించరాదన్నారు. నామినేషన్ దాఖలుకు అభ్యర్థులను రిటర్నింగ్ అధికారి చాంబర్‌కు పంపడంలో ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటించాలని, బందోబస్తు విషయంలో అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజు, మిర్నల్ శ్రేష్ట, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, అదనపు డిసిపి ప్రసాదరావు, జిల్లా సహకార అధికారి మురళీధర్ రావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె. శ్రీరాం, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మదన్ గోపాల్, రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల ప్రక్రియకు పటిష్ట బందోబస్తు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్ తెలిపారు. మంగళవారం ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో కలిసి నూతన కలెక్టరేట్ కార్యాలయం ఎంట్రన్స్ గేటు నుంచి రిటర్నింగ్ అధికారి చాంబర్ వరకు చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి 25 వరకు జరుగుతుందని రిటర్నింగ్ అధికారి చాంబర్‌ను నూతన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ఆయన తెలిపారు. నామినేషన్ సమయంలో నూతన కలెక్టరేట్ వద్ద పటిష్ట బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి చాంబర్ నుండి 100 మీటర్ల పరిధిలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం బందోబస్తు చర్యలు ఉండాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈసందర్భంగా ప్రక్రియ అంతా పూర్తి నిఘాతో ఉండేందుకు ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజు, మిర్నల్ శ్రేష్ట, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, అదనపు డిసిపి ప్రసాదరావు, ఖమ్మం ఏసిపి రమణ మూర్తి, జిల్లా సహకార అధికారి మురళీధర్ రావు, సూపరింటెండెంట్లు మదన్ గోపాల్, రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చితికిపోతున్న చిరు వ్యాపారులు

అండగా నిలిచిన సిపిఐ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కార్పొరేట్ రంగం విస్తరించడం, ప్రభుత్వాల నిర్లక్ష్యం వెరసి చిరు వ్యాపారులు చితికిపోతున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు తెలిపారు. చిరు వ్యాపారులను ప్రభుత్వం ప్రత్యేక రుణాలు ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు. కొత్త బస్టాండ్ సెంటర్‌లో వివిధ చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి సమావేశం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో మంగళవారం జరిగింది. సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ చిరు వ్యాపారులకు గతంలో బ్యాంకులు రుణాలు ఇచ్చేవని కానీ ఇప్పుడు ఆ ఊసెత్తడం లేదన్నారు. బిజెపి కార్పొరేట్ శక్తులకు అండగా నిలబడి చిరు వ్యాపారులను మింగేస్తున్నారని కార్పొరేట్ సంస్థలు మొత్తం వ్యాపార సామ్రాజ్యాన్ని కబళించి వేస్తున్నాయని శ్రీనివాసరావు తెలిపారు. అనేక మంది చిరు వ్యాపారులు ఇప్పటికే వ్యాపారాలను వదిలి గుమస్తాలుగా, రోజు కూలీలుగా మారారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులు సంఘంగా ఏర్పడి తమ హక్కుల కోసం పోరాటాలు చేయాలని అందుకు సిపిఐ అన్ని వేళల అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు ఎస్‌కె సైదా, మేకల రవి, ఎండి యూసఫ్, చిరు వ్యాపారులు నర్సింహాచారి, శేఖర్, కామేష్, సాయి, సికిందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 19న అజయ్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకులు పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని బిఆర్ఎస్ నియోజక వర్గ కమిటీ నిర్ణయించింది. ఈనెల 19న జన్మదిన వేడుకలతో పాటు ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ బిఆర్ఎస్ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక ఖమ్మం బిఆర్ఎస్ కార్యాలయంలో భారీ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సభకు పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు ఎంపిలు వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు, ఎంఎల్‌సి తాతా మధు, జిల్లాకు చెందిన పలువురు మాజీ శాసన సభ్యులు, నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు.

## ఎంపి వద్దిరాజును సత్కరించిన పువ్వాడ, నామ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాజ్యసభకు రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికై పదవి ప్రమాణస్వీకారం చేసిన వద్దిరాజు రవిచంద్రను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం లోక్‌సభ బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావులు శాలువలతో ఘనంగా సత్కరించి మిఠాయిలు తినిపించారు. మంగళవారం బిఆర్ఎస్ ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ ముఖ్య నాయకుల సమావేశం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాసంలో జరిగింది. వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభకు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికై తన నివాసంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆత్మీయ స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. ఎంపి నామ నాగేశ్వరరావుతో కలిసి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

## గుండెపోటుతో యువకుని మృతి

-పెళ్లయిన ఏడు నెలలకే విషాదం -కన్నీరు మున్నీరవుతున్న కుటుంబం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జీవితం ఎంతో సాఫీగా సాగిపోతుంది. భార్యాభర్తలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇన్నాళ్లు కష్టపడి పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలన్న ఆలోచన ఆ యువకుని మదిలో ఉంది. కానీ విధి వక్రీకరించింది. గుండెపోటు రూపంలో ప్రాణాలను బలిగొన్నది. దీనితో ఇప్పుడిప్పుడే పేదరికం నుంచి మధ్యతరగతి స్థాయికి ఎదుగుతున్న ఆ కుటుంబంలో గుండెపోటు పెను విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే... రఘునాథపాలెం మండలంలోని వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన నిదిగొండ బిక్షం, రామలక్ష్మి దంపతులు కష్టజీవులు. కుమారుడు, కుమార్తెను కష్టపడి చదివించారు. కుమార్తెకు వివాహం కాగా కొడుకు అభిలాష్ (30) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరిన తర్వాత ఏడు నెలల క్రితం ఖమ్మంకు చెందిన తులసి తో వివాహం జరిపించారు. ఆనందమయంగా కుటుంబం ఉన్న సమయంలో మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లి వచ్చిన అభిలాష్ మంచంపై పడుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అభిలాష్ అందరితో కలివిడిగా ఉండేవాడు. చిన్నా, పెద్దల పట్ల గౌరవంతో మెలిగే అభిలాష్ మృతి వెంకటాయపాలెం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. చేతికి వచ్చిన కొడుకు మృతితో తల్లిదండ్రులతో పాటు భార్య తులసి రోదనలు మిన్నంటాయి.

## ఐపిఎస్‌గా ఎంపికైన రావూరి సాయి అలేఖ్య



**ప్రజాపక్షం/ మధిర :** మంగళవారం వెలువడిన యూపిఎస్సీ సివిల్స్ ఫలితాల్లో మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రావూరి ప్రకాశ్‌రావు కుమార్తె రావూరి సాయి అలేఖ్య ఐపిఎస్‌గా ఎంపికయ్యారు. బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన రావూరి సాయిఅలేఖ్య చిన్నతనం నుండే ఐపిఎస్ కావాలని పట్టుదలతో తల్లిదండ్రుల సహకారంతో ఆలీండియా లెవల్‌లో 938వ ర్యాంకు సాధించి ఐపిఎస్‌గా ఎంపికైంది. ఐపిఎస్‌గా ఎంపికైన రావూరి సాయిఅలేఖ్యను మధిర సిఐ మధు, టౌన్ ఎస్ఐ సంధ్య, ఇరత పోలీస్ సిబ్బంది, తదితరులు అభినందించారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన



**ప్రజాపక్షం/ మధిర :** ప్రస్తుత వేసవికాలంలో సంభవించే అగ్ని ప్రమాదాలపై మధిర ఫైర్ స్టేషన్ సిబ్బంది అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని లక్కీ టవర్ అపార్ట్‌మెంట్లో స్థానికులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రాంబాబు, నాగేశ్వరరావు, రామిరెడ్డి చెన్నారావు పాల్గొన్నారు.

## నేడు దండి భాస్కర్ 8వ వర్ధంతి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** సిపిఐ నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ కామ్రేడ్ దండి భాస్కర్ 8వ వర్ధంతి వేడుకలు నేడు నిర్వహిస్తున్నట్టు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం గ్రామంలో గల ఆయన స్మారకస్థూపం వద్ద ఉదయం 9గంటలకు జరగనున్నాయన్నారు. సిపిఐ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

## వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటా ప్రచారం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం బిజెపి పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం ఖమ్మం రూరల్ మండలం చిన్న తండలోని బూత్ నెంబర్లు 117,118, 119 లలో శక్తి కేంద్రం ఇంఛార్జి బానియానాయక్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా ఇంటిగోడపై అభ్యర్థి ఫోటోలు కలిగి ఉన్న స్టిక్కర్లను అంటించారు. ప్రజల ఆశీర్వదంతో గెలిచి చేపట్టబోయే అభివృద్ధి,సంక్షేమ ఫలాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, రాష్ట్ర మహిళామోర్చా కార్యదర్శి విజయరెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు కన్నెటి కోటయ్య, మండల అధ్యక్షుడు భట్టు నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి లంకపల్లి సాగర్, స్థానిక బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిబ్బంది నిర్లక్ష్యంతో గడ్డివాముల దగ్ధం



**ప్రజాపక్షం/ కూసుమంచి :** గైగొళ్లపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని ఉదతలగూడెం లో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో వరిగడ్డి వాము దగ్దమైంది. డబుల్ బెడ్‌రూం ఇండ్ల పక్కన జాల మోహన్ రావు, కంబాల పద్మ, బెల్లి పరమేష్ లకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామ పంచాయితీ సిబ్బం ది గత నాలుగు రోజుల నుంచి చెత్త ను అక్కడ నిల్వ చేసి డంపింగ్ యార్డుకు తరలించకుండా మంగళవారం చెత్తకు నిప్పం టించారు. దీనితో గాలి వేడిమికి పక్కనే ఉన్న గడ్డివాముకు అంటుకుని సుమారు రూ. 50వేల విలువైన గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వరిగడ్డి దొరకకపోవడంతో ఒక్కో దిండు రూ.100ల చొప్పున కొనుగోలు చేసి ట్రాక్టర్ల ద్వారా తరలించామని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఫైరింజన్ సకాలంలో రాకపోతే మరింత ప్రమాదం జరిగి ఉండేది. గ్రామ పంచాయితీ కార్యదర్శిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది.

## ఎన్నికల నిబంధనలను పాటించాలి



**ప్రజాపక్షం/ మధిర :** రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తహశీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు ప్రింటింగ్ ప్రెస్, కల్యాణ మండపాల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం పార్లమెంట్ ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులకు ప్రింటింగ్ పనులు చేయాలని పేర్కొన్నారు. ప్రింటింగ్ వేసిన కరపత్రాలు, పోస్టర్లపై తప్పనిసరిగా ప్రతుల సంఖ్య, ప్రింటింగ్ ప్రెస్ పేరు, సెల్ నెంబర్, ప్రచురనకర్తల పేర్లు ఉండాలన్నారు. ప్రింటింగ్ వేసిన అనంతరం వాటిని తహశీల్దార్ కార్యాలయం నందు సమర్పించాలని సూచించారు. పట్టణంలో ఉన్న కల్యాణ మండపాల నందు అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చట్టపరమైనచర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ప్రింటింగ్ ప్రెస్, కల్యాణ మండప యజమానులు పాల్గొన్నారు.

## ఘనంగా సాయిగణేష్ రెండో వర్ధంతి



**ప్రజాపక్షం/కారేపల్లి:** భారతీయ జనతా పార్టీ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో బిజెపి కార్యకర్త సాయి గణేష్ రెండో వర్ధంతి సందర్భంగా కారేపల్లి పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. సాయిగణేస్ మరణానికి ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేసి మానసికంగా హింసించడం వలన ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. సాయిగణేష్ పార్టీకి చేసిన సేవలను జిల్లా నాయకులు కల్తీ రాంప్రసాద్ తాలూరి రాంబాబు, తురక నారాయణ, మేకల మల్లేష్, ధన్సరి శ్రీనివాస్, మహిళా నాయకురాలు సుజాత, అనిల్, రవీందర్ తదితరులుపాల్గొన్నారు.

# జనరేటర్ చుట్టూ చెత్త తొలగింపు

**ఆర్‌టిఓ కార్యాలయంలో విద్యుత్ సమస్యపై స్పందించిన అధికారులు**






**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ (బైపాస్‌రోడ్):** ఖమ్మం జిల్లా రవాణాశాఖ అధికారి(ఆర్టీఓ)కార్యాలయంలో మరమ్మత్తులకు గురైన జనరేటర్ సమస్యను అధికారులు పరిష్కరించారు. మంగళవారం 'ఆర్టీఓ కార్యాలయంలో నిలిచిన విద్యుత్' అనే శీర్షికతో 'ప్రజాపక్షం' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. జనరేటర్ మెయింటినెన్స్ లేకపోవడంతో ఏర్పడిన సమస్యను అక్షర రూపంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. దీనిపై అధికారులు స్పందించి జెసిబి సహాయంతో జనరేటర్ చుట్టూరా ఉన్న చెత్తను తొలగించారు. విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు జనరేటర్ వెంటనే అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా సిబ్బందిని సూచించారు. అక్కడ నిర్లక్ష్యం మాటున దాగిఉన్న సమస్య పరిష్కరంకు అక్షర రూపాన్ని అందించిన ప్రజాపక్షానికి పలువురు అభినందనలు తెలిపారు.

# ఉపాధిహామీ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలి

**- ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకులు బందెల వెంకయ్య**




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** పేద ప్రజల బుక్కెడు పొట్టను నింపేందుకు చట్టపరంగా ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని, అకిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం లోని ఎం,వెంకటాయపాలెం గ్రామంలో ఉపాధిహామీ కూలీల సమస్యలపై జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉపాధి కూలీలకు రోజుకు రూ.600వందల ఇవ్వాలని, వేసవికాలంలో మంచినీటి సరఫరా ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా మజ్జిగ, ఓఆర్ఎస్‌ప్యాకెట్లు, నిమ్మరసం, మెడికల్ కిట్లు, పని ప్రదేశంలో టెంట్లు వేసి పని చేయించాలన్నారు. పనిలో గాయపడిన కూలీలకు వైద్య ఖర్యులు రోజువారి మస్టర్లు వేసి 100నుండి 200వందల రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. తదిత డిమాండ్లను సైతం తక్షణమే పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, శీలం పూలమ్మ, కందుల మరియమ్మ, రెంటాల సరోజన, పిల్లి భరణి, వడగాని ధనలక్ష్మి, దాసరి నాగమణి, సుధారాణి, పందుల శాంత, రెంటాల రూప, రెంటా వెంకటి, కందుల ఎల్లయ్య, తోకల వెంకన్న, లింగన్న, యామనిసుజాత, కందుల లక్ష్మయ్య పాల్గొన్నారు.

# కళాకారులకు పుట్టినిల్లు మధిర

**నాటక రంగానికి ప్రాణం పోస్తున్న శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్**




**ప్రజాపక్షం/ మధిర :** అంతరించిపోతున్న కళలకు ప్రాణం పోస్తూ నేటి ఆధునిక సమాజానికి నాటక రంగం గొప్పదనాన్ని వివరిస్తూ ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరుపేటకు చెందిన గద్దం సుబ్బారావు స్థాపించిన శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ ద్వారా కళాకారులను కళామితల్లి ముద్దు బిడ్డలుగా తీర్చిదిద్దుతున్న స్ఫూర్తి ఎంతో గొప్పది. నేటి ఆధునిక యుగంలో నాటక రంగానికి ఆదరణ కరువైంది. ఈ తరుణంలో ప్రతి సంవత్సరం శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ ద్వారా నాటక పోటీలను నిర్వహించి నాటక రంగానికి ప్రాణం పోస్తూ నేటి తరానికి నాటకాన్ని పరిచయం చేస్తున్న కళాపరిషత్ సేవలు మరువలేనివి. ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరుపేటకు చెందిన గద్దం సుబ్బారావు ఆధ్వర్యంలో 2013లో శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ ఏర్పాటు చేశారు. 2014 నుండి మధిర వేదికగా ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో పౌరాణికం, సాంఘికం, జానపదం పోటీలను నిర్వహిస్తూ కళలను ప్రోత్సహిస్తున్నారు. అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో ప్రతి సంవత్సరం మధిరలో కళాకారులకు వనభోజనాలను ఏర్పాటు చేసి ఉత్తమ కళా ప్రదర్శన చేసిన కళాకారులకు అవార్డులతో సత్కరిస్తున్నారు. ఏప్రిల్ 16న తెలుగు నాటక దినోత్సవం సందర్భంగా నాటక పోటీలను ఏర్పాటు చేసి బహుమతులు అందచేసే వారు. రాష్ట్ర రంగస్థల సమాఖ్య అధ్యక్షులు పుతుంబాక కృష్ణప్రసాద్ సహకారంతో సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించిన నాటక పోటీలకు దాదాపు 200మంది కళాకారులు హాజరై పోటీలు పడి నటించే వారు.

**కళలను ప్రోత్సహించేందుకే పోటీలు...**

నేటి యువతరానికి నాటక రంగాన్ని పరిచయం చేసేందుకే ప్రతి సంవత్సరం శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు గద్దం సుబ్బారావు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు గతంలో పాలకులు అధికారులు నాటక రంగాన్ని ఉపయోగించుకునే వారన్నారు. ప్రస్తుతం నాటక రంగానికి ప్రాధాన్యత తగ్గిందని, రాష్ట్ర ప్రభుత్వం నాటక రంగాన్ని, కళాకారులను ప్రోత్సహించాలని, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


## ఖమ్మం గోశాలకు పశుగ్రాసం ట్రాక్టర్లు



**ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్:** వర్షాభావ పరిస్థితులు కారణంగా ఏర్పడిన గడ్డి కొరత మూలంగా రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు మేరకు మంగళవారం సత్తుపల్లి ప్రాంతం నుండి ఖమ్మం గోశాలకు రైతులు మొదటి విడతగా సుమారు 50 ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని తరలించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి నేతృత్వంలో, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పశుగ్రాసానికి సహకరించిన రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి జెండా ఊపి ప్రారంభించారు.

# హరితహారం అబాసుపాలు..!




**-సంరక్షణ లేక నర్సరీలలో ఎండుతున్న మొక్కలు**
**-లక్షల్లో ప్రజా ధనం వృథా**





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం పథకం సిబ్బంది నిర్లక్ష్యం , పర్యవేక్షణ లోపం కారణంగా అబాసుపాలవుతుంది. పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఖర్చు చేస్తున్న కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా అవుతుంది. ప్రతి గ్రామ పంచాయితీలోను నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచి తర్వాత జూన్, జూలై మాసాల్లో నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు గత ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హరిత హారం పథకం క్రమేపి ప్రాధాన్యత కోల్పోయింది. ఇప్పుడు మండలంలో పని చేస్తున్న అధికారులు కార్యాలయాలకే పరిమితమయ్యారు. దీనితో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. ఇదే సమయంలో సర్పంచుల పదవి కాలం కూడా ముగియడంతో పంచాయితీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఖమ్మం, వరంగల్ జాతీయ రహదారి వెంబడి ప్రతి గ్రామ పంచాయితీ రహదారుల వెంట నాటిన మొక్కలను బతికించడంలో సిబ్బంది విఫలమయ్యారు. ఇప్పుడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలోను మొక్కలు ఎండిపోతున్నాయి. వేసవి సంరక్షణ చర్యలు తీసుకోవడంలో వైఫల్యమే మొక్కలు ఎండిపోవడానికి కారణమవుతుంది. సరైన సమయంలో నీళ్లు పోయడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదే సమయంలో గ్రామ పంచాయితీ వాటర్ ట్యాంకర్లు సొంత పనులకు వినియోగించుకుంటున్నారు. పంచాయితీ కార్యదర్శుల నిర్లక్ష్యం కారణంగా ఎండిపోతున్న నర్సరీలలోని మొక్కలను కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# 50 ఆకుల తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలి : కల్లూరి




**ప్రజాపక్షం/చర్ల :** 50 ఆకుల తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వర రావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో మండల కార్యదర్శి నూపా పోతయ్య అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో మూడవ పంట అయిన తునికాకు సేకరణ ద్వారా ఆదివాసీలు, ఇతరులు ఆదాయం పొందుతారని చెప్పారు. ఎండను సైతం లెక్కచేయకుండా ఆకు సేకరణకు తెల్లవారక ముందే అడవి బాటపడతారని చెప్పారు. ప్రాణాలకు తెగించిన సేకరించిన తెచ్చిన తునికాకుకు సరైన ధర లేకపోవడంతో ఆదివాసీలు, ఇతరులు పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తునికాకు కాంట్రాక్టర్లు మాత్రం కోటాను కోట్లు సంపాదిస్తున్నారన్నారు. ఆకు సేకరణలో క్రూర మృగాల భారిన పడి తునికాకు సేకరించే వారు మరణిస్తున్నప్పటికీ ప్రభుత్వం, గుత్తేదారులు సరైన పరిహారం చెల్లించడం లేదన్నారు. 50 ఆకుల తునికాకు కట్టకు గిట్టుబాటు ధర కల్పించకుండా ఆదివాసీలను నిలువునా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసీలు తునికాకును సేకరించకుంటే బీడి పరిశ్రమలు మూతపడిపోతాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని 50 ఆకుల కట్టకు రూ.5 చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆకు సేకరణ సమయంలో గాయాల పాలైన వారికి రూ.2 లక్షలు, మరణించిన వారికి రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికి కూడా తునికాకు బోనస్ చెల్లించకపోవడం విడ్డూరంగా ఉందని, వెంటనే బోనస్ డబ్బులు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ, తిరుపతిరావు, రామారావు, నాగేశ్వరరావు, ముత్తయ్య, మంగమ్మ అనసూయ, వెంకట నర్సమ్మ, భద్రమ్మ, లక్ష్మి, పద్మ, రామయ్య, శ్రీను, సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, లక్ష్మయ్య, సావిత్రి, ముత్తమ్మ, రమేష్, కన్నయ్య, గంగయ్య, చిన్న, సింగయ్య, రాంబాబు, సుబ్బయ్య, రాజారావు, నాగరాజుపాల్గొన్నారు.

# అమరుడు కోరం జగ్గయ్య ఆశయాలను కొనసాగిస్తాం

**మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య**



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా సీనియర్ నాయకులు, అమరుడు కోరం జగ్గయ్య ఆశయాలను కొనసాగిస్తామని పార్టీ రాష్ట్ర నాయకులు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుమ్మడి నరసయ్య అన్నారు. కోరం జగ్గయ్య సంస్మరణ సభ మంగళవారం మండల పరిధిలోని పాత అంజనాపురం గ్రామంలో మండల కార్యదర్శి భానోత్ ధర్మ అధ్యక్షతన జరిగింది. కోరం జగ్గయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం గుమ్మడి నర్సయ్య పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ జగ్గయ్య గత 30 సంవత్సరాలుగా పార్టీలో చురుకైన కార్యకర్తగా కొనసాగుతూ పాత అంజనాపురం గ్రామంలో పోడు భూమి వ్యవసాయ కూలీ ఉపాధి కూలీలు గిట్టుబాటు ధరలు అనేక సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో, ప్రజలను కదిలించడంలో చురుకైన పాత్ర పోషించారన్నారు పార్టీలో ఉన్నతమైన లక్ష్యంతో పనిచేశారని, అతని మరణం విప్లవ పార్టీకి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. ప్రస్తుతం దేశంలో మతోన్మాద ప్రమాదం పొంచి ఉందని రోజు రోజుకి నరేంద్ర మోడీ ప్రభుత్వం క్రిస్టియన్లు, మైనార్టీలు, వెనకబడ్డ వర్గాలపై అనేక దాడులు చేస్తుందని, ప్రశ్నించే ప్రతి వ్యక్తిని ఉప చట్టాల కింద అక్రమంగా కేసులు పెట్టి జైళ్ళలో పెడుతుందని, ఈ నిర్బంధ కాండాకు వ్యతిరేకంగా పాసిజానికి వ్యతిరేకంగా బలమైన ప్రజా పోరాటాలు నిర్వహించడమే జగ్గయ్యకు అర్పించే నిజమైన నివాళి అని గుమ్మడి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కృష్ణ, మాచర్ల సత్యం, మండల కార్యదర్శి బానోతు ధర్మ, ఐ ఎఫ్ టు యు జిల్లా నాయకులు వై గోపాలరావు, లక్ష్మి దేవి పల్లి మండల కార్యదర్శి గుగులోత్ రామచందర్, ఈసం పాపయ్య, పోలె బోయిన కేశవరావు, నాగభూషణం, సులోచన, లక్ష్మి, రజాక్, పార్టీ డివిజన్ నాయకులు కే వెంకటేశ్వర్లుతో పాటు పార్టీ గ్రామ శాఖ సభ్యురాలు కోరం జగ్గన్న సతీమణి కోరం మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రామయ్యకు ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం

**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీరామ వనమి తిరుకళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రామయ్యకు ఘనంగా ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి శాంతకుమారితో పాటు జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక ఆలా, ప్రత్యేకాధికారి నరేంద్ర నిమ్జే, పాల్గొన్నారు. ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సామికి విశేష పూజ, పుణ్యహావచనం, వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పల్లకీలో రామ లక్ష్మణులను ఆలయం నుండి గిరిప్రదిక్షణగా వైకుంఠ ద్వారం వద్దకు తీసుకొచ్చారు. సీతమ్మవారిని మరో పల్లకీలో వైకుంఠ ద్వారానికి ఎదురుగా ఉన్న మిథిలా స్టేడియం వద్దకు తీసుకొచ్చారు. రామయ్య కీర్తి ప్రతిష్టలు, సీతమ్మవారి గుణగణాలను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆ ప్రాంగణంలో నవ్వులు పుశాయి.

## శ్రీరామనవమి శుభాకాంక్షలు : జెడ్‌పిటిసి శ్రీలత



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, పార్టీ నేతలకు కార్యకర్తలకు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులకు, అభిమానులకు జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరిగే పండుగ శ్రీరామనవమి అని, నవమి సందర్భంగా కుటుంబాలు శోభయామానంతో కలకలాడుతూ కనిపించాలని కోరారు. ప్రజలు ఆయురారోగ్యాలు సుఖ శాంతులతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. లోక కళ్యాణం కోసం భగవంతుడు శ్రీరాముడి రూపంలో మానవజన్మ పొందారని, యావత్ మానవళికి శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. తల్లి దండ్రులు తమ్ముళ్లు భార్య బిడ్డల పట్ల ఆయన చూపిన ప్రేమానురాగాలు ప్రస్తుత కుటుంబ వ్యవస్థకు ఆదర్శనీయమన్నారు. రాజ్యాధికార ఇంటి పెద్దగా రాముడి సేవలు వెల కట్టలేనివని పేర్కొన్నారు. సీతారాముల పవిత్ర లోక కళ్యాణాన్ని పవిత్ర భద్రాచలంలో ఎంతో అంగరంగ వైభవంగా జరగటం సంతోషకరమన్నారు.

## కుటుంబ పాలనతో ప్రజలు విసిగిపోయారు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** కేసీఆర్ కుటుంబ పాలనతో ప్రజ లు విసుగు చెందారని అందుకే కాంగ్రె స్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బిజెపి ఎంపి అభ్యర్థి తాండ్ర వినోద్ రావు ఆరోపిం చారు. మండలం లోని తిప్పన పల్లి, చంద్రుగొండ, అయ్యన్నపాలెం, దామరచర్ల, మద్దుకూరు గ్రామాల్లో ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో అధికారంలోకి వస్తే దక్షిణ అయోధ్యగా భద్రాచలం పట్టణాన్ని తీర్చిదిద్దుతామన్నారు. అదే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా పోడు భూమి సాగు చేస్తున్న వారికి హక్కు పత్రాలు ఇచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పార్లమెంట్ సభ్యుడిగా నామా నాగేశ్వరరావు గత ఐదు సంవత్సరాల్లో జిల్లాకు ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు గారడితో కాలం వెళ్లబుచ్చారని, వారి కుటుంబ స్వలాభం కోసం పని చేశారని భార్య దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఇంటికి పంపించారన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రంగా కిరణ్, మండల అధ్యక్షులు బోగి క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధు వైఖరి మార్చుకోవాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం మంగళవారం విలేకరుల సమావేశం బిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకులు సోమందల నాగరాజు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా నాయకులకు, కార్యకర్తలకు విజ్ఞప్తి విషయమేమిటంటే బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం ఎంపి నామా నాగేశ్వరరావు పోటీ చేయుచున్నారు. నామ నాగేశ్వరరావు గెలుపు ఖాయం కాని తాతా మధు ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధు చేసే పనుల వలన ఇప్పటికే ఖమ్మం జిల్లాలో ఓటమి పాలయ్యాము. నామ నాగేశ్వరరావు గెలుపు నల్లేరు మీద నడక వంటిది. తాతా మధు చేసే ప్రయత్నాల వలన నామ నాగేశ్వరరావు కూడా ఓడిపోక తప్పదు. ఎందుకంటే కార్యకర్తలు ఈజిల్లాలో తాతా మధు చేసే పనులు నచ్చక ఇప్పటికే వివిధ పార్టీలకు వెళ్లిపోతున్నారు. అయ్యా తాతా మధు ఇప్పటికైనా మీరు మీ ఆలోచనను మార్చుకొని కార్యకర్తలు ఎందుకు పార్టీ మారుతున్నారు తెలుసుకోండి. ఒకవేళ ఇలానే ఉంటే అయ్యా కెసిఆర్ కెటిఆర్ హరీష్‌రావు ఇప్పటికైనా ఈ జిల్లా పైన నామ నాగేశ్వరరావు గెలుపును అడ్డుకోవడానికి ప్రయత్నం చేస్తున్న తాతా మధుపై చర్య తీసుకొని ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసే నాయకుని చూసి పెట్టాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. లేనియెడల ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ త్వరలో తాతా మధు ఆధ్వర్యంలో కనుమరుగు కావడం ఖాయం. త్వరగా ఈ విషయాన్ని తెలుసుకోవాలని అన్నారు.

# రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

**-అన్ని ఏర్పాట్లు పూర్తి**
**-జిల్లా ఎన్నికల అధికారి విపి గౌతమ్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి విపి గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో కలిసి నామినేషన్ ప్రక్రియపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 21న ఆదివారం మినహాయించి మిగిలిన ఏడు రోజులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థికి సంబంధించి మూడు వాహనాలను మాత్రమే అనుమతించబడునని మిగిలిన వాహనాలు 100 మీటర్ల దూరంలో ఉండాలని ఆయన తెలిపారు. నూతన కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో ఒకేసారి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఒక ప్రపోజర్, గుర్తింపు పొందని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ప్రపోజర్లు ఉండాలన్నారు. పోటీ చేయు అభ్యర్థులు దేశంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండవచ్చునని ప్రపోజర్లు మాత్రం ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గంలో ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్‌లో ముద్రణకు చిహ్నాలు ఎన్నికల సంఘం నుండి వస్తాయని ఫోటోల విషయంలో అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈనెల 26న రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో స్క్రూటీ ప్రక్రియ చేపట్టబడుతుందని ఆయన తెలిపారు. ఈనెల 29 మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉన్నట్లు ఆయన తెలిపారు. కలెక్టరేట్‌లో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు లెటెస్ట్ నామినేషన్ పత్రం ప్రింట్, అఫిడవిట్ పత్రాలు అందుబాటులో ఉంచినట్లు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నామినేషన్ ఫారం 2ఎలో, అఫిడవిట్ ఫారం 26లో సమర్పించాలన్నారు. అన్ని కాలములు పూర్తి చేయాలన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చు విషయమై తాజా బ్యాంక్ ఖాతాలు తెరవాలని, ఎన్నికల సంబంధ లావాదేవీలన్ని ఆ ఖాతా ద్వారానే జరపాలన్నారు. ఎస్సి, ఎస్టి అభ్యర్థులైతే రూ. 12,500, మిగిలిన అభ్యర్థులకు రూ. 25వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణ చెక్‌లిస్ట్ ప్రకారం సిద్ధం చేసుకోవాలని ఆయన తెలిపారు. నామినేషన్ ప్రక్రియ అంతా సిసి కెమెరాల నిఘా ఉంటుందని ఎన్నికల సంఘానికి లైవ్ టెలికాస్ట్ అవుతుందని ప్రతిది రికార్డు అవుతుందని ఆయన తెలిపారు. ఈనెల 17న వ్యయ పరిశీలకులు, 23న సాధారణ, పోలీస్ పరిశీలకులు జిల్లాకు రానున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్రియాశీలకంగా పని చేస్తున్నాయని, ఎస్ఎస్‌టి టీమ్‌లు ఈనెల 18 నుండి పని చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 102 కేసులు నమోదైనట్లు, 96 మద్యం కేసులు, రూ. 1.50 కోట్ల నగదు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కాగానే నిఘాను పటిష్టం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఎవరైనా ధనం, మద్యం ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేస్తే సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ట, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎంఏ గౌస్, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె. శ్రీరాం, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్లు రాంబాబు, మదన్‌గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారి విధి నిర్వహణ ఎక్కడ?

- ఎలాంటి అనుమతులు లేకుండా కడుతున్నా నిర్మాణాల వైపు చూడరు
- రియల్ వెంచర్లు వైపు చూడరు
- మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారి పర్యవేక్షణ లోపంతో ఎలాంటి అమనుతులు లేకుండా పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా రియల్ వెంచర్లు వేస్తున్నారు. ఇప్పటికే వైరా మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీకి పర్మినెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడం, ఉంటే టౌన్ ప్లానింగ్ అధికారి గృహం నిర్మాణాలపై ప్రత్యేక చొరవ చూపకపోవడం, డిటిసి అనుమతులు లేకుండా రియల్ వెంచర్లు వేస్తున్నారు. అటువైపు పోకపోడం, గృహ నిర్మాణాలు అనుమతులతో నిర్మాస్తున్నారా లేక అనుమతులు లేకుండానే కడుతున్నారా అనే దానిపై పూర్తిగా పర్యవేక్షణ చేయకపోవడమే అక్రమ నిర్మాణాల పరంపరం కొనసాగుతుంది. ఇప్పటికే టౌన్ ప్లానింగ్ అధికారిపై పెద్ద ఎత్తున విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఎందుకంటే పూర్తిస్థాయిలో వైరా మున్సిపాలిటీకి టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడం వారంలో రెండు మూడు రోజులు ప్రస్తుతం ఉన్న టౌన్ ప్లానర్ విధులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కేవలం టౌన్ ప్లానర్ వైరా మున్సిపాలిటీలో విధులు నిర్వహణలో కనిపించడం లేదని ఆరోపణలు లేకపోలేదు. ఏదైనా సమస్య వస్తే తన అసిస్టెంట్‌ని పంపించి తూతూ మంత్రంగా పోయామా వచ్చామా అనే ధోరణిలో ఇక్కడ ఒక తతంగం నడుస్తుంది. పుట్టగొడుగుల్లా రియల్ వెంచర్లు ఏర్పాటు రిజస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అనుమతులు లేకుండా రియల్ వెంచర్లు ఏర్పాటు చేసిన వాటి వైపు చూసిన నాథుడు లేడు. మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో రాజశేఖర్‌నగర్‌లో అనుమతులు లేకుండానే భవనాలు నిర్మిస్తున్నారు. ఆ భవనాల నిర్మాణం వైపు కనీసం చూసిన నాథుడే లేడు. అలాగే మున్సిపాలిటీలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాల వైపు ఎలాంటి పర్యవేక్షణ లేదు. టౌన్ ప్లానింగ్ అధికారి తనకేమి పట్టనట్టు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎందుకంటే అతనిపై రాజకీయంగా ఒత్తిడి కూడా ఉందనే ఆరోపణలు లేకపోలేదు. ఎక్కడైనా అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయని తెలిస్తే అక్కడికి అధికారులు వెళితే కొంతమంది ప్రజాప్రతినిధులు టౌన్ ప్లానింగ్ అధికారిని నువ్వు అటువైపు వెళ్లవద్ద అనే ఒత్తిడి తేవడంతో విధి నిర్వహణలో పూర్తిస్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారి పూర్తిస్థాయిలో విధులు నిర్వహించలేకపోతున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఒక బాధ్యత గల ప్రభుత్వ అధికారి నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పనులు చేసిన అలాంటి పనుల గురించి పర్యవేక్షించాల్సిన అథారిటీ అతనికి ఉంటుంది. ఎవరో కొంతమంది రాజకీయ నాయకులు విధులకు దూరంగా ఉంటూ అక్రమ కట్టడాల వైపు కన్నెత్తి చూడకుండా ఉండటం విధి నిర్వహణలో తప్పు కాదా ఎందుకంటే అధికారికి ఇబ్బంది కలుగుతున్నప్పుడు జిల్లా కలెక్టర్‌కు మున్సిపాలిటీలో ఉన్న ప్రస్తుతం పరిస్థితి వివరించాలి. అనంతరం మున్సిపాల్ కమీషనర్‌కు ఇక్కడ జరిగే పరిస్థితిని చెప్పాలి. కాని అలాంటిది ఏమి ప్రస్తుతం ఉన్న టౌన్ ప్లానర్ చేయడం లేదు. ఎందుకో ఏమిటో తెలియదు కాని విధి నిర్వహణలో పూర్తిస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఎందుకంటే ఇప్పటికే అనుమతులు లేకుండా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మున్సిపాలిటీకి రూపాయి చెల్లించకుండా అక్రమ కట్టడాలు మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు వైరా మున్సిపాలిటీపై జోక్యం చేసుకొని వైరా మున్సిపాలిటీకి ప్రత్యేకంగా పర్మినెంట్‌గా ఉండే టౌన్ ప్లానింగ్ అధికారిని కేటాయించి మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడకుండా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో దుకాణాలు దగ్ధం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ప్రధాన రహదారిపై ఉన్న మూడు దుకాణాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం దగ్ధమయ్యాయి. ఆర్ ఐ లు తెలిపిన వివరాల ప్రకారం... కల్లూరు లోని ప్రధాన రహదారి పై ఉన్న పండ్ల దుకాణం టైర్లు కొట్టు కొలిమిలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు రెవిన్యూ ఇన్స్పెక్టర్లు తెలిపారు. పండ్ల దుకాణంలో పలు రకాల పళ్ళు, మంటల్లో కాలిపోవడంతో ఆస్తి నష్టం మూడు లక్షలు జరిగినట్లు యజమాని నజీర్ ఫిర్యాదు మేరకు ఆస్తి నష్టాన్ని వేసినట్లు అదే విధంగా టైర్లు దుకాణం యజమాని ఆకుల ప్రసాద్ ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి, నష్టాన్ని అంచనా వేశామని దానిలో 60,000 నష్టం జరిగినట్లు మరియు కొలిమి లో 50,000 నష్టం జరిగినట్లు యజమాని నెహ్రూ ఫిర్యాదు మేరకు అంచనా వేసి చేసినట్లు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు స్టాలిన్, అన్వర్లు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకులు మట్టా దయానంద్ లతో పాటు పసుమర్తి చందర్‌రావు, మండల పార్టీ నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వం నుంచి నష్టాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## కల్లూరులో బిజెపి అభ్యర్థి ప్రచారం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పడమటి లోకవరం, పుల్లయ్య బంజర గ్రామాలలో బిజెపి పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కుటుంబాలు బిజెపిలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశం అన్ని రం గాల్లో అభివృద్ధి చెందుతుందని ప్రజలు రాబోయే రోజుల్లో మళ్లీ పట్టం కట్టబోతున్నారని పేర్కొన్నారు. బుర్రి వెంకటరామారావు, వాసుని కిషోర్, నున్న నరసయ్య, అబ్బూరు శ్రీనివాసరావు, కురువెల్ల కృష్ణ చారి, వంగల శ్రీను, తండు లక్ష్మణ్ రావు, రంగు రవి, గంగవరపు పుల్లమ్మ, అంజయ్య, రాకేష్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

## చలివేంద్రాలతో ప్రజల దాహార్తిని తీర్చాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజల దాహర్తి ని తీర్చేందుకు చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని మోటాపురం గ్రామంలో మంగళవారం చలి వేంద్రం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ప్రజల దాహర్తి ని తీర్చేందుకు ప్రతీ పంచాయతీ లో చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి పనుల వద్ద టెంట్లు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల ను అందిస్తున్నట్లు తెలిపారు. పనులు కు కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు చలి వేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ తదితరులు పాల్గొన్నారు.

## రాములోరి కళ్యాణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** భద్రాచలం దేవస్తానం లోని రాములోరి కళ్యాణం ను ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యాక్షుడు పసుమర్తి శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఆయన మాట్లాడారు....భద్రాచలం వెళ్లి రాముడు కళ్యానం ను చూడలేని భక్తులు టీవీల ద్వారా ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూస్తారని అన్నారు. కానీ ఎన్నికల సంఘం కోడ్ పేరుతో ప్రత్యక్ష ప్రసారం ను నిలిపివేసిందని అన్నారు. దీని వలన రామ భక్తులు మనో భావాలు దెబ్బతీస్తాయని అన్నారు. ఎన్నికల సంఘం మరోమారు ఆలోచించి భక్తుల కోరిక మేరకు కల్యాళ తంతు ను ప్రత్యక్ష ప్రసారం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కోట్ల మంది భక్తులు టీవీల ద్వారా కల్యాణం ను తిలకిస్తారని అన్నారు. కావునా ప్రత్యక్ష ప్రసారం కు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ముస్తాబైన ఆళ్లపాడు రామాలయం



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని ఆళ్లపాడు రామాలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. శ్రీ రామ నవమి పర్వదినం సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గతంలో శ్రీరామ నవమి సందర్భంగా జరిగిన ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో అందరి సహకారంతో శ్రీ సీతారాముల కల్యాణం జరిపేందుకు గ్రామస్థులు సిద్ధమయ్యారు. గత సంవత్సరం జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బోనకల్ ఎస్సై మధుబాబు, దేవాదాయశాఖ అధికారిణి సమతతో కలిసి మంగళవారం గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులకు పలు సలహాలు, సూచనలిచ్చారు. ప్రస్తుత ప్రజాప్రతినిధి ఆళ్లపాడు ఎంపిటిసి పారా శ్రీదేవి ఆధ్వర్యంలో శ్రీ రామనవమి వేడుకలను జరిపించాలని ఎండోమెంట్ అధికారిణి సమత తెలిపారు. గ్రామంలో ఎవరైనా ఘర్షణలకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.


# నేడు జగదభి రాముని జగత్ కళ్యాణం

-పర్ణశాలలో సీతారాముల పరిణయం
- అధిక సంఖ్యలో తిలకించనున్న భక్తులు
-సకల ఏర్పాట్లు సిద్ధం









**ప్రజాపక్షం / దుమ్ముగూడెంః** పముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం అనుబంద ఆలయం పర్ణశాల శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో నేడు శ్రీ సీతా రాములు కళ్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. నేడు జరిగే కల్యాణంకు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలత్తెకుండా అధికార యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు సిద్ధం చేసింది.కల్యాణ మండపం వద్ద సలవ పందిళ్లు ఏర్పాటు చేసారు. గ్రామ పంచాయితీ ఆద్వర్యంలో పారుశుద్య పనులు చేపట్టారు.త్రాగు నిటి వసతులు , ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆద్వర్యంలో మెడికల్ కేంద్రాలను ఏర్పాటు చేసారు.

**అధిక సంఖ్యలో తిలకించనున్న భక్తులు...**

దక్షిణ అయోద్యగ ప్రసిద్దిగాంచిన భద్రాచల శ్రీ సీతా రాములు దేవస్థానం తరహాలో పర్ణ శాల ఆలయంలో కూడా కళ్యాణ క్రతువు ఘనంగా నిర్వహిస్తారు. మద్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నం లో శ్రీ సీతా రాములు తిరు కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహిస్తారు. దేశ నలుమూల నుండి భద్రాచలంవచ్చే భక్తులు అక్కడ దర్శనం అనంతరం పర్ణశాల శ్రీ సీతారములు దర్శించుకున్న అనంతరం సీతా పంచవటి కుటీరం , నార చీరల ప్రాంతాలను తిలకిస్తారు. ఇక్కడ లభించే కుంకుమ రాళ్లు , విప్ప పూవును ప్రసాదంగా స్వీకరిస్తారు .

**ఏర్పాట్లు సిద్ధం ...**

నేడు జరగనున్న సీతా రాములు కళ్యాణం లో ఎటు వంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పంచాయితీ కార్యదర్శి ఎ ం. వెంకటేశ్వర్లు పారిశుద్యకార్మికులతో ఎప్పడి కప్పులు పారి శుద్య పనులు చేపట్టారు.రోడ్డుకు ఇరువైపులు చెత్తా చెదారం తొలగించి బ్లీచింగ్ చల్లించారు. మంచిటి వసతి ఏర్పాటు చేసారు. భక్తులకు తాత్కాలిక మరుగు దొడ్లు ఏర్పాటు చేసారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ పరిశీలించారు. మంగళవారం రఘునాథపాలెం మండల పరిధిలోని వేపకుంట్ల, గణేశ్వరం గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కలెక్టర్ విపి గౌతమ్, అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి మస్టర్లు తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి వారికి అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనులు చేపట్టే ప్రదేశాల్లో కూలీలకు కనీస వసతులు సమకూర్చాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. పని ప్రదేశాల్లో తప్పనిసరిగా నీడ సౌకర్యం కల్పించాలని పనులు పూర్తయ్యే వరకు కూలీలకు వసతులు సమకూర్చాలన్నారు. కూలీలు కూడా రోజు వారి వేతనం వచ్చే విధంగా పనులు చేపట్టాలన్నారు. చెరువుల్లో పూడిక తీసే పనులు కూడా ఉపాధి హామీ పథకంలో చేపట్టాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ కళ్యాణి మెజర్‌మెంట్స్‌ను చూపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి హరికిషన్, డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్య, అదనపు పిడి శిరీష, క్లస్టర్ ఏపిడి శ్రీదేవి, డిఎల్‌పివో కీర్తి ప్రభాకర్, ఎంపిడివో అశోక్‌కుమార్, ఎంపివో శ్రీనివాసరెడ్డి, ఏపివో పద్మయ్య నాయుడు, గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారి మీనాక్షి, పంచాయితీ కార్యదర్శులు సుజాత, రాజు, ఈసి దీపక్, ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకయ్య,రవి తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్లు డైరెక్ట్‌గా వచ్చి చేసుకోవచ్చు

-డాక్యుమెంట్ రైటర్లు అవసరం లేదు
-లబ్దిదారుడే నేరుగా డాక్యుమెంట్ రాసుకోవచ్చు
-వైరా సబ్ రిజిస్ట్రార్ కరుణ



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/వైరాః** సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు నేరుగా రిజిస్టర్ కార్యాలయం సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఎలాంటి మధ్యలో డాక్యుమెంట్ రైటర్‌ను ఆశ్రయించాల్సిన అవసరం లేదని వైరా సబ్ రిజిస్టర్ కరుణ తెలిపారు. ప్రజాపక్షం కథనానికి స్పందించిన రిజిస్ట్రార్. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ కరుణ మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ కార్యాలయానికి సంబంధించిన ఎలాంటి రిజిస్ట్రేషన్ అయిన అవి నేరుగా చేసుకునే విధంగా అవకాశం ఉందని, దానిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యలో ఎవరిని నమ్మి ఎవరు వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన అవసరం లేదని నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేయాలి.ఏ విధంగా చేయాలి అని రిజిస్టర్ కార్యాలయంలో అడిగి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. డాక్యుమెంటేషన్ చేయాల్సిన అవసరం లేదని, ఎలాంటి వ్యక్తులు మీ వద్దకు వచ్చి రిజిస్ట్రేషన్ సంబంధించి మాయమాటలు చెప్పి మిమ్మల్ని మోసం చేయాలని చూసేత వారి వివరాలు నేరుగా మాకు ఇవ్వాలని ఆమె తెలిపారు. ప్రజలు ముఖ్యంగా గమనించాల్సింది సబ్ రిజిస్టర్ కార్యాలయానికి సంబంధించి మేము అన్ని పనులు చేస్తాము. డాక్యుమెంటేషన్ మేమే చేయాలి అని ఎవరైనా చెప్పినా అలాంటి వారి మాయమాటలు నమ్మవద్దని తెలిపారు.

# అమెరికా యూనివర్సిటీలతో శ్రీ చైతన్య కళాశాల ఒప్పదం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నెకల్లు పంచాయతీ పరిధిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల వారు అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీలతో మంగళవారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇండియానా,ఆవుయాలా యూనివర్సిటీల ప్రతినిధులతో,కళాశాలలో యాజమాన్యం అవగాహన చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పన్నాల కృష్ణమూర్తి మాట్లాడారు...ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, విఎల్ఎస్ఐ చీప్‌డిజైన్, సెమికండక్టర్, పవర్ సిస్టమ్స్ లేత్ టెక్నాలజీ వంటి అంశాలపై బోధన చేయనున్నట్టు తెలిపారు. ఈ బోధనల ద్వారా విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు ఎంతో తోడ్పాటు లభించడంతో ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. ఈ అవగాహణ ఒప్పందంలో కళాశాల సిఈఓ పుట్ట శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, కంప్యూటర్స్ విభాగం అధిపతి డాక్టర్ వి.సుదర్శన్, ఈసి విభాగ అధిపతి డాక్టర్ రాజేష్, యూనివర్సిటీల ప్రతనిధులు ప్రొఫెసర్లు ప్రియా కుర్లే, జామిమార్కోమర్చిస్‌లు కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధిపతులు సిహెచ్ కృష్ణ ప్రసాద్, హరిప్రసాద్, శ్రీకుమార్, భావన పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతిని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండలంలోని అన్నారుగూడెంలో ఇటీవల జరిగిన అంబేద్కర్ 133వ జయంతిని విజయవంతం చేసిన ప్రతిఒక్క కార్మికుడికి, గ్రామప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు అన్నారుగూడెం హామాలీ కార్మికుల ముఠామేస్త్రీ గొడ్ల కిసింది అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జయంతి వేడుకలకు తమ కార్మికులు ఆర్ధిక సాయంతో పాటు నిత్యం అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిఒక హామాలీ కార్మికుడికి పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హామాలీ కార్మికులు జి.బాబు, సూరి, రంగా, నర్సింహారావు, నాగేశ్వరారవు, అబ్బాస్, యాకోబు, లక్ష్మయ్య, మనోజ్, సంజీవరావు, చిన్న నర్సింహారావు, తిరుపతిరావు, కె.వెంకటి, జరవి, లోకయ్య పాపారావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఫెమెరల్ విష్పర్స్ పుస్తకావిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** హార్వెస్ట్ విద్యా సంస్థల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని శిశిర వ్రాసిన ఎఫెమెరల్ విష్పర్స్ (కరిగిపోయిన మాధుర్యపు ప్రతి ధ్వనులు) ఆంగ్ల పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల యాజమాన్యం తెలిపింది. తాట్స్ హైమ్స్ పబ్లిషర్స్ వారు ఆంగ్లంలో ప్రచురించిన తమ విద్యార్థిని పుస్తకంలో ద లవ్ స్టోరీ ఆఫ్ సోషల్ మీడియా (వైరల్ హార్ట్స్), ద లైఫ్ ఆఫ్ బ్రోకెన్ బోయ్, ఎ గర్ల్స్ ఎంట్రీ ఇన్ హిస్ లైఫ్ మొదలగు కథనాలతో ముద్రించబడిందన్నారు. రచనపై ఉన్న ఆసక్తితో తన చుట్టూ ఉన్న ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలపై చక్కని ఆలోచనా ధోరణితో పుస్తకం వ్రాయడం అభినందనీయమన్నారు. త్వరలో ఇంగ్లీష్‌లో పద్య సంపుటి కూడా శిశిర ద్వారా రాబోతుందన్నారు. రచనపై చిన్నారికి ఉన్న అభిరుచిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల కరస్పాండెంట్ పి. రవి మారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతి రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బొడ్రాయి, ముత్యాలమ్మ గుడికి రెండు లక్షల వితరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండల పరిధిలోని కెవి బంజర గ్రామంలో బొడ్రాయి కొలువు, ముత్యాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి మాలోత్ రాము నాయక్ రూ. 2 లక్షలు వితరణ చేశారు. మంగళవారం రాము నాయక్ రెండు లక్షల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అజ్మీర వీరునాయక్ బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి రెండు లక్షల రూపాయలను విరళంగా అందించారు. వారిరువురికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రానికి 10 కుర్చీలు వితరణ



**ప్రజాపక్షం/కారేపల్లిః** మైనార్టీ నాయకులు గౌసిద్దీన్ ఆధ్వర్యంలో కారేపల్లి బిసి కాలనీలో అంగన్‌వాడీ కేంద్రానికి 10 కుర్చీలను వితరణగా అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు కుర్చీలు లేక క్రింద కూర్చోవడంతో విషయాన్ని తెలుసుకున్న గౌసిద్దీన్ మంగళవారం అంగన్‌వాడీ ఉపాధ్యాయులు రఘుపతి సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టంటం వెంకన్న, సమ్మయ్య, షేక్ సద్దాం, బూది ఖిలియుల్లా ఖాన్, సుజాత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రఘుపతి గౌసిద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# కూనంనేని సమక్షంలో సిపిఐలో పలువురి చేరిక





**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** వివిధ పార్టీల నుంచి సుజాతనగర్ మండలం కోమటిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో సిపిఐలో చేరారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ నందు జరిగిన సుజాతనగర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం సందర్భంగా వీరికి కూనంనేని పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రాథమిక సభ్యత్వాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన అనతికాలంలో నియోజకవర్గంలో వివిధ పథకాల క్రింద మంజూరైన నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు పూర్తి చేశామని, ఇంకా కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని, ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చిన తన దృష్టికి తేవాలన్నారు. నూతనంగా పార్టీలో చేరుతున్న నాయకులు అనుబంధ ప్రజా సంఘాలతో భాద్యత తీసుకొని సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా దస్రు, వాసిరెడ్డి మురళి, జక్కుల రాములు, భూక్యా శ్రీను, కేశవరావు, దండు సురేష్, మంగ్యా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో ఉపాధి కూలి వెంకటమ్మ మృతి

## -నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కూనంనేని





**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** వడదెబ్బకు గురై చుంచుపల్లి మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలి గిరిజన మహిళా బూరుగు వెంకటమ్మ(55) మంగళవారం మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా పెనుబల్లి గ్రామంలోని వెంకటమ్మ గృహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వేసవి యెడల తీవ్రత రోజురోజకు పెరుగుతుందని, ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. అధికారులు పనులు జరిగే ప్రాంతాల్లో వేసవి రక్షణ చర్యలు చేపట్టాలని వారికి కావాల్సిన రెస్టు షెల్డర్లు, టెంట్లు, త్రాగునీరు, ఓఆర్ఎస్, ప్రాథమిక చికిత్స కిట్టు అందుబాటులో ఉంచాలని సూచించారు. జరిగిన సంఘటనను ఫోన్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.20లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, ఉపాధి అధికారులు పనులు జరిగే క్షేత్రాలను సందర్శించి పనులను, రక్షణ చర్యలను పర్యవేక్షించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత జిల్లా అధికారులు ఉపాధి పనులపై దృష్టి సారించి కూలీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలకు ఆదేశించాలని కోరారు. నివాళులు అర్పించిన వారిలో నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రెడ్డి శ్రీను, నర్సింహారావు, భూలక్ష్మి, భద్రమ్మ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సంస్థల అభివృద్ధికి మోడీ గ్యారంటీ



**ప్రజాపక్షం/వైరా:** భారతదేశానికి నరేంద్రమోడీ గ్యారంటీ పేరుతో భారతీయ జనతా పార్టీ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఏప్రిల్14న విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో కార్పొరేట్ సంస్థల మరింత అభివృద్ధికి మోడీ గ్యారంటీ లాగా రైతులు ఆత్మహత్యల వైపు నెట్టేసి విధంగా ఉందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. వైరా మండలం గొల్లెనపాడు గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు జరిగిన కార్యక్రమంలో రాంబాబు మాట్లాడుతూ దేశంలో రైతాంగానికి మద్దతు ధరలకు గ్యారంటీ, రైతులు రుణమాఫి కావాలని, 2018 నుంచి రైతులు ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. కనీసం మద్దతు ధరలకు గ్యారంటీ మాటా లేకుండా బిజెపి ఎన్నికల మేనిఫెస్టో ఉందని అన్నారు. మద్దతు ధరలు పెంచుతాం అంటున్నారు. కాని ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ఇతర ఇన్‌పుట్ ధరలు పెరుగుదల, దేశంలో ద్రవ్యోల్బణం, వాతావరణ మార్పులు ప్రభావం పరిగనలోకి తీసుకొని మద్దతు ధరల నిర్ణయం ఉంటుందని, గ్యారంటీ ఎందుకు ఇవ్వడం లేదన్నారు. భారతరత్న స్వామినాధన్ కమీషన్ సూచించిన వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధర సి2ప్లస్50కి గ్యారంటీ ఎందుకు ఇవ్వడం లేదన్నారు. గత రెండు పార్లమెంటు ఎన్నికలు సందర్భంగా నల్లధనం పంపకం, సంవత్సరానికి రెండు కోట్ల యువతకు ఉద్యోగాలు వాగ్దానాలను అమలు లేకుండానే మరల నరేంద్రమోడీ గ్యారంటీ అంటే 9 ఆర్థిక సంవత్సరాల్లో రూ.14లక్షల కోట్ల రూపాయలు రుణమాఫి, రాయితీలు పొందిన కార్పొరేట్ సంస్థలు మరింత అభివృద్ధికి గ్యారంటీ లాగా ఉందని రైతులు, నిరుద్యోగులు, పేద మధ్యతరగతి ప్రజలను విస్మరించిన బిజెపికి ఓటు ద్వారా సమాధానం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిలారు శ్రీనివాసరావు, ఆళ్ళ శ్రీనివాస్, వెంపటి రాజా, నల్లమోతు వెంకటనారాయణ, కంచర్ల శ్రీనివాసరావు, నల్లమోతు రాజాబాబు, కొణిదన ధర్మారావు, పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# టిఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/ బోనకల్ :** టిఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో బోనకల్ మండలానికి చెందిన ఉపాధ్యాయులు కె.రమేష్, జి.శ్రీనివాస్, పి.గోపాల్‌రావు తదితరులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎంఇఓ ఇందిరాజ్యోతి సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వి.రాంబాబు, జిల్లా నాయకులు సద్దా బాబు, మండల అధ్యక్షులు బి.ప్రీతం, మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, నాయకులు కె.సౌభాగ్యలక్ష్మి, చంద్రప్రసాద్, పి.పుల్లారావు, చిన్న రంగారావు, కోటయ్య, మురళీ, నారాయణ, లవకుశ, నసీమా, సుల్తానా, పుల్లారావు పాల్గొన్నారు.

# వడదెబ్బ బాధితులకు ప్రత్యేక వార్డు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పెరుగుతున్న వడదెబ్బ బాధితులు రోజు రోజు కు పెరుగుతున్నారు. జిల్లా లోనే అత్యధికంగా ఉష్ణోగ్రత నేలకొండపల్లి లో నమోదు అవుతుంది. ఈ నేపధ్యంలో స్థానిక ప్రభుత్వ హస్పిటల్ కు బాధితులు విపరీతంగా వస్తున్నారు. రోజుకు 250 కు మించి పేషెంట్లు వస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేక వార్డు ను ఏర్పాటు చేశారు. అందులో అవసరమైన మెడిసిన్, సిబ్బంది ని సిద్ధం చేసి ఉంచారు. అదే విధంగా వార్డు కు ప్రత్యేకంగా కూలర్లు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కోరారు. ఎండ దెబ్బకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.ముఖ్యంగా ఉపాధి హామీ పధకం పనులు చేసే కూలీలు వడదెబ్బ కు గురవుతున్నారు.

**వడదెబ్బ బాధితులకు ప్రత్యేక వార్డు : డాక్టర్.మంగ్ల, మెడికల్ ఆఫీసర్, నేలకొండపల్లి.**
మండలం లోని వడ దెబ్బ కు గురైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వార్డు ను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతుందని అన్నారు. అస్వస్థతకు గురైతే వెంటనే ప్రభుత్వ హస్పిటల్ కు తీసుకరావాలని సూచించారు.

# అదుపు తప్పి డీజిల్ ట్యాంకర్ బోల్తా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణం లోని బస్ స్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారి పై అదుపుతప్పి డీజిల్ ట్యాంకర్ బోల్తా కొట్టింది. మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఖమ్మం వైపు నుండి అశ్వారావుపేట వైపు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ అదుపు తప్పి పట్టణంలోని ప్రధాన రహదారిపై బోల్తా కొట్టింది. ట్యాంకర్ నుండి భారీగా డీజిల్ బయటకు పోవటంతో ఆందోళన నెలకొంది. ట్యాంకర్ బోల్తా పడిన స్థలానికి కొద్ది దూరం లోనే బోజన హోటల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ ఉన్నాయి. అయితే డీజిల్ భారీగా పోతూ ఉండటంతో పోలీస్‌లు చుట్టు పక్కల హోటల్స్ ను మూసివేయించి ట్రాఫిక్ ను దారి మళ్లించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు చెలరేగకుండా ప్రత్యేక ద్రావణాన్ని స్ప్రే చేశారు. డీజిల్ ట్యాంకర్ నుండి సుమారు అర కిలోమీటర్ దూరం వరకు డీజిల్ వ్యాపించింది. క్రెయిన్ సహాయం తో బోల్తా పడిన ట్యాంకర్ ను సాధారణ స్థితికి తీసుకురావటం తో ఊపిరిపీల్చుకున్నారు.

# మంచి కమ్యూనిస్ట్‌గా భద్రాద్రి



**ప్రజాపక్షం/ములకలపల్లి :** ఈర్ల భద్రాద్రి మంచి కమ్యూనిస్ట్‌గా తన జీవితంలో పేద ప్రజలకు సేవలు అందించినారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. జగన్నాథపురంలో భద్రాద్రి 5వ వర్ధంతి సందర్భంగా సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుండి కమ్యూనిస్ట్‌గా పెరిగి ప్రజా ఉద్యమాల్లో మిలిటంట్ పోరాడిన వ్యక్తి భద్రాద్రి అని అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడ వరకు పని చేశారని , ప్రజల్లో భద్రాద్రి నిరంతరం జీవించి ఉంటారని సాబీర్ పాషా అన్నారు. ఈసందర్భంగా చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శ సభ్యులు నరాటి ప్రసాద్, శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎండి యూసుఫ్, ఎస్‌కే జబ్బార్, రవి, వెంకటరమణ, రామ్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/కామేపల్లి:** పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. సభలు సమావేశాలు ర్యాలీలు ఆందోళనలు నిర్వహించరాదని అన్నారు. అదే విధంగా అనుమతులు లేకుండా డీజేలు ఊరేగింపులు నిర్వహించరాదని అన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్వహించరాదని హెచ్చరించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనబడితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపిస్తే పార్టీ వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మండలంలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే తమకు సమాచారం అందించాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు నాయకులు సహకరించాలన్నారు.

# వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర సందర్శన



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులకు మంగళవారం క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహకార సంఘాల నిర్వహణ, రుణాలు పొందే తీరు, ఆర్థికంగా సంఘాలు ఏ విధంగా ముందుకు సాగుతాయన్న వాటిపై గ్రామదీపిక కొప్పుల శివకుమారి అవగాహన కల్పించారు. అధ్యాపకులు డాక్టర్ కృష్ణతేజ మాట్లాడుతూ సాధారణ మహిళలు ఎవరి సహకారం లేకుండా బ్యాంకుల ద్వారా ప్రభుత్వం కల్పించే ఆర్థిక ప్రోత్సాహంతో జీవితంలో ముందుకు సాగుతారని, తద్వారా మహిళలు తమ కుటుంబాలను ఆర్థికంగా ముందుకు నడిపించుకుంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.